
మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ

ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయం

● మంత్రి దామోదరం రాజనర్సింహ

సైదాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ అన్నారు. చంపాపేటలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ నూతనంగా ఏర్పాటు చేసిన చిక్కుడు బాలయ్య స్మారక ఆస్పత్రిని మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మంత్రి రాజనర్సింహ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ అందించడం సామాజిక బాధ్యతని, సేవాదృక్పథం అని, ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆస్పత్రిలో అధునాతన పద్ధతులను మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసాచారి పాల్గొన్నారు.


తాగునీటి సమస్యపై మహిళలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బలాల

రూ.22లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

● మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల

చాదర్‌ఘాట్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని గడ్డిఅన్నారం బస్తీలో అధ్వానంగా తయారైన సీసీరోడ్ల నిర్మాణానికి తక్షణమే ప్రతిపాదనలు తయారు చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం డివిజన్‌లోని గడ్డిఅన్నారం పోచమ్మ బస్తీలో తాగునీటి సరఫరాలో జరుగుతున్న అంతరాయంతో తలెత్తుతున్న నీటి ఎద్దడిపై స్థానిక మహిళలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అక్కడే ఉన్న జలమండలి మలక్‌పేట డివిజన్ డీజీఎం హష్మత్‌అలీకి తాగునీటి సమస్య తలెత్తడానికి కారణాలపై ఆరాతీశారు. వెంటనే తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఆయన డీజీఎంకు సూచించారు. వచ్చే వారానికి తాగునీటి సరఫరా మెరుగుపడుతుందని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే బస్తీకి చెందిన మహిళల్లో ఎవరైనా ఒకరు తనకు ఫోన్ ద్వారా విషయాన్ని వివరించాలన్నారు. అదేవిధంగా గడ్డిఅన్నారం బస్తీలో అధ్వానంగా తయారైన రోడ్లను సీసీ రోడ్లుగా తీర్చిదిద్దేందుకు రూ.22లక్షలను వెచ్చించేందుకు ప్రతిపాదనలు తయారయ్యాయని ఎమ్మెల్యే వివరించారు. వీలైనంత త్వరగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు మొదలవుతాయని తెలిపారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుంటా : కొప్పుల

హయత్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుంటానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని రాజరాజేశ్వరీకాలనీ, శివంహిల్స్, పవనగిరికాలనీల్లో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి తాను ఎల్లప్పుడు ముందుంటానని అన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా అభివృద్ధి పనుల్లో కొంత జాప్యం జరిగిందన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు హరిప్రసాద్, మాధవరెడ్డి, నర్సింహుడు, హరినాథ్, కొండ శ్రీనివాస్, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీను, శ్రీధర్‌గౌడ్, యాదగిరియాదవ్ పాల్గొన్నారు.


అగ్రికల్చర్‌కాలనీలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

ఓపెన్ జిమ్ ప్రారంభం

చంపాపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ అగ్రికల్చర్ కాలనీలో శుక్రవారం జీహెచ్‌ఎంసీ నిధులు రూ.10.50లక్షలతో చేపట్టిన ఓపెన్ జిమ్‌ను కార్పొరేటర్ సుజాతానాయక్ కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. అనంతరం కాలనీలోని పార్కులో అర్బన్ బయోడైవర్సిటీ నిధులు రూ.20లక్షలతో చేపట్టనున్న పార్కు సుందరీకరణ, బోరు మోటరు బిగింపు పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు అన్నారు. కాలనీలో సీసీ, బీటీ రహదారుల, యూజీడీ నిర్మాణం కోసం కృషి చేయనున్నట్లు అన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, మమత మల్లేష్‌గౌడ్, కాలనీ ప్రతినిధులు జితేందర్‌రెడ్డి, జగత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పీఎల్‌ఎన్‌శర్మ, రాము పాల్గొన్నారు.


వరదనీటి కాలువ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వరదనీటి కాలువ పనులను పూర్తిచేయాలి

వనస్థలిపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సకాలంలో వరదనీటి కాలువ పనులను పూర్తి చేయాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. హయత్‌నగర్ డివిజన్ కమలానగర్‌లో చేపడుతున్న వరదనీటి కాలువ పనులను శుక్రవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదనీటి కాలువ పనులు చేపట్టే సమయంలో అక్కడే ఉన్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్లు, మంచినీటి పైప్‌లైన్లకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా తగుజాగ్రత్తలు తీసుకుని నాణ్యతతో కూడిన వరదనీటి కాలువ పనులు సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ ఏఈ హేము, జలమండలి సిబ్బంది బాలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రీడాలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు


సదస్సుకు హాజరైన ప్రతినిధులకు పత్రాలను అందజేస్తున్న ఐసీఏఆర్- క్రీడా డైరెక్టర్ వీ.కె.సింగ్, డా.ఎ.కె సింగ్ తదితరులు

సంతోష్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సంతోష్‌నగర్‌లోని సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైలాండ్ అగ్రికల్చర్(ఐసీఏఆర్-క్రీడా)లో వర్షాధారిత వ్యవసాయం, స్థితిస్థాపకత, స్థిరమైన జీవనోపాధికి మార్గాలను నిర్మించడంపై మూడు రోజుల పాటు నిర్వహించిన రెండవ అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిహార్ వ్యవసాయ విశ్వవిద్యాలయం(బీఏయూ) మాజీ వైస్ ఛాన్సలర్ డా.ఎ.కె సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థకు వర్షాధార వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. శిలజ ఇంధన వినియోగాన్ని తగ్గించడం ద్వారా స్థితిస్థాపకతను తగ్గించడం సాధ్యమని అన్నారు. వ్యవసాయం, కొత్త పంటల రకాలు, కొత్త వ్యవసాయ పద్ధతులు, పంట వైవిధ్యం, వర్షాధార వ్యవసాయం యొక్క ఉత్పాదకత స్థితిస్థాపకతను పెంచే కొత్త విస్తరణ పద్ధతులను అభివృద్ధి చేయడంలో పరిశోధకులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముగింపు కార్యక్రమంలో సెషన్‌వారీగా ప్రజెంటేషన్ అవార్డులు, ఉత్తమ పోస్టర్ అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐసీఏఆర్- క్రీడా డైరెక్టర్ వి.కె.సింగ్, ఐసీఏఆర్ న్యూఢిల్లీ డీడీజీ డా.ఎస్ కె చౌదరి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డా. జె.వి.ఎన్.ఎస్ ప్రసాద్, పలు రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఎన్జీవో అధికారులు సుమారు 750 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

వికలాంగుల రుణాల దరఖాస్తు గడువు 12 వరకు పొడిగింపు

ఓల్డ్‌మలక్‌పేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల కోసం ప్రవేశపెట్టిన వందశాతం రాయితీ రుణాల దరఖాస్తు గడువు ఫిబ్రవరి 12 వరకు పొడిగించినట్లు వికలాంగుల కార్పొరేషన్ జేఎండీ బి.శైలజ తెలిపారు. మొదట ఫిబ్రవరి 2 వరకు ఉన్న దరఖాస్తుల గడువు రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగ సంఘాల నుంచి వచ్చిన వినతుల మేరకు పెంచినట్లు పేర్కొన్నారు.

108 కలశాలతో అభిషేకం

కొత్తపేట : వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా కొత్తపేట సీటీఓకాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆర్యవైశ్య వాసవీ మాత సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ పవన్‌కుమార్, సమితి అధ్యక్షుడు రామ్‌కోటేశ్వర్‌రావు, ప్రతినిధులు శ్రీనివాసరావు, సురేష్, వెంకటరమణ, మధు, వంశీకృష్ణ హాజరయ్యారు.

రాచకొండలో 11 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

హైదరాబాద్‌సిటీ : రాచకొండ కమిషనరేట్‌లో 11మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ సుధీర్‌బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఇన్‌స్పెక్టర్ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
జగదీష్	ఎస్‌హెచ్‌వో మాడ్గుల	ఎస్‌హెచ్‌వో ఇబ్రహీంపట్నం
వేణుగోపాల్‌రావు	స్పెషల్ బ్రాంచి	ఎస్‌హెచ్‌వో మాడ్గుల
ఎల్. భాస్కర్‌రెడ్డి	ఎస్‌వోటీ ఎల్‌బీనగర్	ఎస్‌హెచ్‌వో కుషాయిగూడ
జి అంజయ్య	ఎస్‌హెచ్‌వో కుషాయిగూడ	షీటీమ్స్
కాస్పరాజు శ్రీనివాస్	ఎస్‌వోటీ మహేశ్వరం	ఎస్‌హెచ్‌వో కీసర
ఏ వెంకటయ్య	ఎస్‌హెచ్‌వో కీసర	ఎస్‌వోటీ ఎల్‌బీనగర్
మన్మోహన్	స్పెషల్ బ్రాంచి	సైబర్ క్రైమ్
శివకుమార్	వెయిటింగ్ ఫర్ పోస్టింగ్	స్పెషల్ బ్రాంచి
టి. రవికుమార్	సైబర్ క్రైమ్	ఎస్‌వోటీ మహేశ్వరం
లక్ష్మీమాధవి	ఉప్పల్ ట్రాఫిక్ పీఎస్	సైబర్ క్రైమ్స్
నాగరాజు	సైబర్ క్రైమ్స్	ఉప్పల్ ట్రాఫిక్ పీఎస్

పండ్ల మార్కెట్‌లో హమాలీల సమస్యలను పరిష్కరించండి


ఏఎంసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో మాట్లాడుతున్న సీపీఐ నేతలు యాదిరెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో హమాలీల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్ ఆధ్వర్యంలో యాదిరెడ్డి ఏఎంసీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. కొంత కాలంగా మార్కెట్‌లో హమాలీలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. లోడింగ్, అన్‌లోడింగ్ సమస్యతో పాటు కూలీలకు యూనిఫామ్, లైసెన్స్‌ల గురించి చైర్మన్, మార్కెట్ సెక్రెటరీ శ్రీనివాస్‌తో చర్చించినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి చైర్మన్, సెక్రెటరీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింహ, సైదులు, పండ్ల మార్కెట్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ షరీఫ్, ప్రధాన కార్యదర్శి చిన్నగౌడ్, పోచయ్య, రాములన్న, శంకర్‌నాయక్, మున్నా, కృష్ణ, రాజా, ముస్తాపా, చంద్రశేఖర్, అంజాద్‌ఖాన్, తిప్పన్న పాల్గొన్నారు.



పట్టా అందుకుంటున్న ఆయుర్వేద వైద్యుడు పొదిలి చిన్నరాజు

పొదిలి చిన్నరాజుకు గౌరవ డాక్టరేట్ ప్రదానం

సైదాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌కు చెందిన ఆయుర్వేద వైద్యుడు పొదిలి చిన్నరాజు యునిటెడ్ థియోలాజికల్ రీసెర్చ్ యూనివవర్సిటీ న్యూయార్క్ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. పేదలకు అందిస్తున్న ఉచిత వైద్యం, వృద్ధులకు ఆసరాగా నిలుస్తుండటాన్ని పరిశీలించిన వర్సిటీ గౌరవ డాక్టరేట్ అందజేసింది. సికింద్రాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రతినిధులు చిన్నరాజుకు పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు చిన్నరాజును కలిసి అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ ఆర్.కె.పురం, లక్ష్మీగణపతి, శివపార్వతి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో నిర్వహణపనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ తెలిపారు. 11కేవీ ఆర్.కె.పురం ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు, 11కేవీ లక్ష్మీగణపతి, శివపార్వతి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

చంపాపేట 11కేవీ ఫీడర్ పరిధిలో..

చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చంపాపేట 11కేవీ ఫీడర్ పరిధిలోని వివిధ మరమ్మతుల కారణంగా శనివారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ కె. శ్రీనివాస్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని చంపాపేట, సాయిరాంనగర్‌కాలనీ, ఆర్‌టీసీకాలనీ, ఆఫీసర్స్‌కాలనీ, వైశాలీనగర్‌కాలనీ, నాగార్జుననగర్‌కాలనీ, భానునగర్, సింగరేణికాలనీ, కేశవనగర్‌కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

సైదాబాద్ : టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతు పనుల కారణంగా శనివారం 11కేవీ సూపర్‌బజార్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ప్రశాంత్‌నగర్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి ఒంటి గంట వరకు, జమాల్‌కాలనీ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12నుంచి ఒంటి గంట వరకు, నూర్‌ఖాన్‌బజార్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉదయం 11నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.


అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయం(ఫైల్)

ఎంపీటీసీల డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల

● 11 నుంచి 8కి తగ్గిన ఎంపీటీసీ స్థానాలు
● 3న ఫైనల్ నోటిఫికేషన్

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఎంపీటీసీ స్థానాల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ విడుదల చేసింది. ఈ మేరకు శుక్రవారం మండల అభివృద్ధి అధికారి శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో మండలంలోని 18 గ్రామాలకు కలిపి 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 2024 సెప్టెంబర్‌లో నాలుగు గ్రామాలను పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. దీంతో మండలంలోని నాలుగు గ్రామాలు మున్సిపాలిటీలో విలీనం కావడంతో ఎంపీటీసీ స్థానాలు ఎనిమిదికి తగ్గిపోయాయి. వాటికి సంబంధించిన ముసాయిదా జాబితాను ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. వాటిపై జనవరి 31 సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు ఆమె తెలిపారు. స్వీకరించిన అభ్యంతరాలను ఫిబ్రవరి 1, 2వ తేదీన పరిష్కరించి 3న ఫైనల్ నోటిఫికేషన్ ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీటీసీ స్థానాల వివరాలు

అబ్దుల్లాపూర్‌మెట్-1, 2, బండరావిరాల, చిన్నరావిరాల-1, కవాడిపల్లి, బలిజగూడ-1, అనాజ్‌పూర్-1, లష్కర్‌గూడ, ఇనాంగూడ, గండిచెరువు-1, మజీద్‌పూర్, గుంతపల్లి, జాఫర్‌గూడ-1, బాటసింగారం, పిగ్లీపూర్-1.

ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం


విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

మన్సూరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): చిన్నాపెద్ద, మహిళలు, పురుషులు తేడా లేకుండా ప్రతి ఒక్కరి ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవడం ఎంతో అవసరమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. 'విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా' చైర్మన్ కోమాకుల సదాశివుడు ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం-2025 క్యాలెండర్‌ను శుక్రవారం తన నివాసంలో మహేష్‌కుమార్‌గౌడ్, ఓ కార్యక్రమంలో సీనియర్ సినీ నటుడు సుమన్‌లు అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్రంలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడడమే కాకుండా పతకాలను సైతం కైవసం చేసుకునేలా క్రీడాకారులను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఆయా కార్యక్రమాలలో నారాయణ స్కూల్స్ జీఎం కె.గోపాల్‌రెడ్డి, అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఆర్.మల్లికార్జున్‌గౌడ్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ యు.శ్రీనివాస్, ఎం.వెంకటేష్, కొయ్యడ ప్రసాద్‌గౌడ్, బండి రామకృష్ణగౌడ్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య గొడవ, పరస్పర దాడి

చాదర్‌ఘాట్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో విద్యార్థుల మధ్య తలెత్తిన గొడవ పరస్పర దాడికి దారితీసింది. మలక్‌పేట ఎస్‌ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. యాకుత్‌పుర నివాసి సయ్యద్ హుస్సేన్ ఫరాజ్(18) డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. దిల్‌సుఖ్‌నగర్‌లోని కోర్ లాంగ్వేజ్ శిక్షణ కేంద్రం నుంచి గురువారం రాత్రి తన స్నేహితుడైన హుస్ నైన్‌తో కలిసి ఇంటికి వెళ్తున్నాడు. మలక్‌పేట ముంతాజ్ కళాశాల సమీపం నుంచి వెళ్తుండగా స్నేహితుడైన దారుషిఫా నివాసి అస్గర్(22) మరో ముగ్గురు స్నేహితులతో కలిసి ఎదురుపడ్డాడు. వీరి మధ్య తలెత్తిన గొడవతో పరస్పరం దాడి చేసుకున్నారు. అనంతరం సయ్యద్ హుస్సేన్ మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్తుండగా మీర్‌చౌక్ పీఎస్ పరిధిలో మరోమారు ఎదురుపడి మళ్లీ పరస్పర దాడులకు దిగారు. అస్గర్ మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మీర్‌పేట్ మాజీ మేయర్ దుర్గాదీప్‌లాల్‌ను సన్మానిస్తున్న కేటీఆర్

మీర్‌పేట్ మాజీ మేయర్‌కు కేటీఆర్ సన్మానం

సరూర్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులుగా పనిచేసి ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న మేయర్లు, డిప్యూటీ మేయర్లు, ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లకు శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ తరపున సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మీర్‌పేట్ తాజా మాజీ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ దంపతులను మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. మాజీ మంత్రులు సత్యవతిరాథోడ్, జి.జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నవదంపతులతో కార్పొరేటర్ పవన్‌కుమార్, ఉపేందర్‌గుప్తా తదితరులు

ఉచిత వివాహం నిర్వహించడం అభినందనీయం

కొత్తపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉచిత వివాహ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. ఆర్థిక స్థోమత లేని యువతీ యువకులు తల్లిదండ్రుల/కుటుంబ సభ్యుల అనుమతితో పెళ్లి చేసుకోవాలనుకునే వారికి తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మొగుల్లపల్లి ఉపేందర్‌గుప్తా యువసేన ఆధ్వర్యంలో ఉచితంగా వివాహ వేడుక నిర్వహిస్తున్నారు. యువసేన ఆధ్వర్యంలో 217వ ఉచిత కల్యాణ వేడుకకు శుక్రవారం కొత్తపేట నాగేశ్వర్‌కాలనీలో గల దాసాంజనేయస్వామి ఆలయ ప్రాంగణం వేదికయింది. వేడుకకు విచ్చేసిన కార్పొరేటర్ యువ దంపతులైన సుమన్, మౌనికలను, మొగుల్లపల్లి ఉపేందర్‌గుప్తా యువసేనను అభినందించారు. వేడుకలో మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తా, యువసేన ప్రతినిధులు పాల్గొన్నారు.


ఆలయ పుష్కర కుంభాభిషేక మహోత్సవాలకు విరాళం అందజేస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి

ఆలయ పుష్కర మహోత్సవాలకు విరాళం

ఎల్‌బీనగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీలోని జ్ఞాన సరస్వతి ఆలయ పుష్కర కుంభాభిషేక మహోత్సవాలకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి రూ.2లక్షలు విరాళంగా అందజేశారు. శుక్రవారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులకు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వరప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంజీవరెడ్డి, పాము యాదగిరి, మధుసూదన్, సుబ్బారావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


కాలనీబోర్డును ప్రారంభిస్తున్న నర్సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి


జిల్లెలగూడలో జెనిగె అడివమ్మ కాలనీ ప్రారంభం

సరూర్‌నగర్ : మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడకు చెందిన జెనిగె మల్లేశ్‌యాదవ్ 17వ డివిజన్‌లోని తమ సొంత భూమిలో ఏర్పాటు చేసిన కాలనీకి తమ అమ్మమ్మ జెనిగె అడివమ్మ స్మారకార్థం ఆమె పేరు పెట్టుకున్నారు. ఈక్రమంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టఫ్ఐడీసీ ఛైర్మన్, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, సరూర్‌నగర్ మాజీ జడ్పీటీసీ జిల్లెల నరేందర్‌రెడ్డి హాజరై జెనిగె అడివమ్మ కాలనీని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి'

చంపాపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్‌మాదిగ కోరారు. హస్తినాపురం డివిజన్‌లోని సుభాష్‌చంద్రబోస్ కాలనీలో గురువారం రాత్రి డప్పుల దరువుతో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో సుధాకర్‌మాదిగ హాజరై మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో లక్షలాది మంది మాదిగలతో చేపట్టనున్న కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి ప్రజలను మోసం చేసిన ముగ్గురి అరెస్ట్


అరెస్టు అయిన నిందితులు

వనస్థలిపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఆటోనగర్‌లోని ఫారెస్ట్ భూమికి సంబంధించి నకిలీ పత్రాలను సృష్టించి ప్రజల వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ముగ్గురు వ్యక్తులను వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధి మన్సురాబాద్‌లోని సర్వేనెంబర్ 7లో 582 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. దీనిపై కన్నేసిన నల్గొండకు చెందిన యూసఫ్‌ఖాన్ అతని భార్య తులసమ్మలు ఇద్దరు కలిసి నకిలీ డాక్యుమెంట్ సృష్టించి అమాయక ప్రజలను మోసం చేసి 100 రూపాయల బాండ్ పేపర్‌తో నోటరీగా ప్లాట్లు విక్రయించారు. ఈ ప్లాట్ల విక్రయానికి సైదాబాద్‌కు చెందిన అడ్వకేట్ షేక్ జిలాని యూసఫ్‌ఖాన్‌కు సహకరించాడు. భూవిక్రయానికి సంబంధించిన సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు భూమి ఆక్రమణకు గురైతుందని వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రభుత్వ భూమిని తన భూమిగా చిత్రీకరించి అమాయక ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసిన యూసఫ్‌ఖాన్ అతని భార్య తులసమ్మ వీరికి సహకరించిన షేక్ జిలానీలను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.